క్రీడల్లోనూ రాణించాలి

సైదాపూర్, అక్టోబర్ 17: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎస్ఐ జన్ను ఆరోగ్యం సూచించారు. ఆకునూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ఇటీవల కరీంనగర్‌లో జరిగిన జిల్లాస్థాయిక్రీడల్లో పాల్గొని మండల జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. మంగళవారం విద్యార్థులు మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐని కలువగా వారిని అభినందించారు. క్రీడాకారులకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానన్నారు. కార్యక్రమంలో పీఈటీ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్‌కే ప్రజాదరణ'

సైదాపూర్, అక్టోబర్ 17: తెలంగాణలో ప్రజా సంక్షేమ పాలన చేస్తున్న బీఆర్ఎస్‌నే ప్రజలు ఎన్నికల్లో ఆదరిస్తారని ఎల్లాస్‌పూర్ సర్పంచ్ కొత్త రాజిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో అన్నివర్గాలవారికి న్యాయం జరుగుతున్నదని పేర్కొన్నారు. ఎన్నికల్లో హుస్నాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వొడితల సతీశ్‌కుమార్ హ్యాట్రిక్ ఖాయమని తెలిపారు.

నూరు శాతం పన్నులు వసూలు చేయాలి

గ్రామాల్లో పక్కా పారిశుధ్యం నిర్వహించాలి • సమీక్షా సమావేశంలో డీపీవో వీరబుచ్చయ్య

ఎరడపల్లిలో కంపోస్ట్ నిర్వహణను పరిశీలిస్తున్న డీపీవో

శంకరపట్నం, అక్టోబర్ 17: నిర్ణీత గడువులోగా నూరు శాతం పన్నులు వసూలు చేయాలని డీపీవో వీరబుచ్చయ్య ఆదేశించారు. మంగళవారం డీపీవో ఎరడపల్లి గ్రామంలో మొబైల్ యాప్ పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన సెగ్రిగేషన్ షెడ్డులో కంపోస్ట్ తయారీ వివరాలు క్షేత్రస్థాయిలో అడిగి తెలుసుకున్నారు. వన నర్సరీ నిర్వహణను పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో పారిశుధ్య పనులు పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించి గ్రామాలు శుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. మురుగు కాలువల చివరన ఇంకుడు గుంతల నిర్మాణాల పనులను త్వరగా ముగించాలని చెప్పారు. ప్రణాళిక ప్రకారం పన్నులు వసూలు చేయాలని సూచించారు. అలాగే గ్రామ పంచాయతీలకు చెందిన విద్యుత్ బిల్లులు, ట్రాక్టర్ ఈఎంఐలను సకాలంలో చెల్లించాలని తెలిపారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో శ్రీవాణి, ఎంపీవో బషీరుద్దీన్, పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖ శ్రీ శారదా పీఠాన్ని సందర్శించిన కెప్టెన్



శారద పీఠాధిపతి స్వరూపానందేంద్ర స్వామితో కెప్టెన్, ఎమ్మెల్యే దంపతులు

చిగురుమామిడి/ సైదాపూర్, అక్టోబర్ 17: విశాఖ శ్రీ శారద పీఠాన్ని మాజీ ఎంపీ కెప్టెన్ వొడితల లక్ష్మీకాంతారావు, ఆయన కుమారుడు హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ మంగళవారం సందర్శించారు. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి సమక్షంలో కొనసాగుతున్న రాజశ్యామల శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మహాస్వామి వారి ఆశీస్సులు స్వీకరించారు. అనంతరం కెప్టెన్ లక్ష్మీకాంతారావు, ఎమ్మెల్యే సతీశ్ కుమార్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా సుఖసంతోషాలతో ఉండాలని, ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో మరోసారి బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కెప్టెన్ లక్ష్మీకాంతారావు సతీమణి సరోజినీ దేవి, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ సతీమణి డాక్టర్ సమిత పాల్గొన్నారు.

జాతీయ అవార్డు గ్రహీతకు ఎమ్మెల్యే సన్మానం



జలపతిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్

తిమ్మాపూర్ రూరల్, అక్టోబర్ 17: ఇటీవల ఢిల్లీలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నేషనల్ అవార్డు అందుకున్న పారునంది జలపతిని మంగళవారం రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్, ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రావుల రమేశ్ సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మాట్లాడుతూ, అంబేద్కర్ ఆశయ సాధన దిశగా ముందుకు సాగడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ పాశం అశోక్ రెడ్డి, యూత్ మండలాధ్యక్షుడు మాదన రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక శిక్షణలో 'ఆదర్శ' విద్యార్థులు

మానకొండూర్ రూరల్, అక్టోబర్ 17: మండలంలోని పోచంపల్లి 'ఆదర్శ' కళాశాల విద్యార్థులు దసరా సెలవుల దృష్ట్యా మంగళవారం ఇంటర్న్ షిప్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంతో పాటు కొండపల్కల, ఊటూర్ గ్రామాల్లో ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. ఇంటర్మీడియట్ చదువుతున్న 12 మంది విద్యార్థులు రోజుకు 8 గంటల చొప్పున మొత్తం 80 గంటలు వృత్తి విద్యను అభ్యసించారు. వారిలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు, భవిష్యత్తులో వారికి ఉపయోగపడేలా వివిధ రంగాల్లో ప్రత్యేక శిక్షణ ఇప్పించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ అర్చనాప్రియదర్శిని తెలిపారు. సెలవులను సద్వినియోగం చేసుకుంటున్న విద్యార్థులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో ప్రత్యేక ట్రైనర్ శ్రీకాంత్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు

చిగురుమామిడి: అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ కొత్త వినీతాశ్రీనివాస్‌రెడ్డి, దాత మహేందర్ కవిత దంపతులు

చిగురుమామిడి, అక్టోబర్ 17: దేవీనవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం దుర్గాదేవిని అన్నపూర్ణ దేవిగా అలంకరించారు. దుర్గాదేవి మండపాల్లో ప్రత్యేక పూజలు చేశారు. చిగురుమామిడి శివాలయంలోని దుర్గాదేవి మండపం వద్ద జరిగిన ప్రత్యేక పూజలో ఎంపీపీ కొత్త వినీతా శ్రీనివాస్ రెడ్డి దంపతులు, మ్యాన మహేందర్ కవితా దంపతులు, మాజీ ఎంపీపీ ఆకవరం భవాని, ఉప సర్పంచ్ ముక్కెర పద్మ పాల్గొన్నారు. మ్యాన మహేందర్ కవిత దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఆకవరం శివప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

పారువెల్లలో..

గన్నేరువరం, అక్టోబర్ 17: దేవీనవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పారువెల్లలో యాదవయూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుర్గాదేవి మండపంలో మంగళవారం అమ్మవారు అన్నపూర్ణ దేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో యాదవ యూత్ కమిటీ సభ్యులు సంగు కనకయ్య, దరి మల్లేశం, ఎలుక రాజు, దర్ అనిల్, సందవేణి అంజయ్య, ప్రభాస్, వంశీ, అనిల్, శేఖర్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి

- **అనుమతుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి**
- **ఎన్నికల రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్**

మానకొండూర్‌రూరల్, అక్టోబర్ 17: అన్ని పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ సూచించారు. మానకొండూర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం మానకొండూర్ నియోజకవర్గంలోని పార్టీల ప్రతినిధులు, తహసీల్దార్లు, ఎన్నికల సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాజకీయ పార్టీల సమావేశాలు, ప్రచారం కోసం అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. మొత్తం 16 అంశాలకు సంబంధించి ఆన్‌లైన్ లేదా సువిధ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. దరఖాస్తులను ఎన్నికల సిబ్బంది, అధికారులు పరిశీలించి అనుమతి ఇస్తారని తెలిపారు. అనంతరం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లను సైతం పరిశీలించారు. మానకొండూర్ తహసీల్దార్ సీహెచ్ రాజు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్లు నవాజ్, ఎన్నికల నాయబ్ తహసీల్దార్ రాకేశ్, సీనియర్ అసిస్టెంట్ సమీన, గిర్దావర్లు సత్యనారాయణ, ప్రవీణ్, సీనియర్ అసిస్టెంట్ జయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

'గౌరవెల్లి'పై ప్రజాభిప్రాయ సేకరణ

మాట్లాడుతున్న డీఆర్వో పవన్ కుమార్

తిమ్మాపూర్, అక్టోబర్17: గౌరవెల్లి ప్రాజెక్టు విస్తరణపై తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీలో తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ మంగళవారం నిర్వహించారు. డీఆర్‌వో పవన్ కుమార్ గౌరవెల్లి ప్రాజెక్టు నిర్వాసితులు, రైతుల అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ప్రాజెక్టు వల్ల నష్టపోయినప్పటికీ కూడా ఎంతో మంది రైతులకు లాభం జరుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. కొందరు నష్టపోయిన కూడా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. పలువురు రైతులు, సంఘాల నాయకులు ప్రాజెక్టు విస్తరణను వ్యతిరేకించారు. మొత్తం ఎనిమిది మంది రైతులు, నాయకులు మాట్లాడగా.. అధికారులు రికార్డు చేసుకున్నారు. నివేదికను నేషనల్ పొల్యూషన్ బోర్డ్‌కు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సదానందం, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ రాజేందర్, నీటి పారుదల శాఖ ఈఈ రమేశ్, సదయ్య, రేష్మ తబుస్సుం, టీఎన్జీవో నాయకులు పోలు కిషన్, లక్ష్మణ్‌రావు, రైతులు పాల్గొన్నారు.

రైస్ మిల్లులో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

శంకరపట్నం, అక్టోబర్ 17: మండల కేంద్రంలోని ఓ రైస్ మిల్లులో విజిలెన్స్ అధికారులు, సివిల్ సప్లై అధికారులు సంయుక్తంగా మంగళవారం నిర్వహించిన దాడుల్లో అక్రమాలు వెలుగు చూశాయి. అక్రమ రేషన్ బియ్యం నిల్వలతో పాటు ప్రభుత్వానికి సీఎంఆర్ ఇవ్వాల్సిన 11 వేల క్వింటాళ్ల ధాన్యం పక్కదారి పట్టినట్లు గుర్తించారు. సోమవారం రాత్రి విజిలెన్స్ అధికారులు, కేశవపట్నం పోలీసులు కొందరి ఫిర్యాదుతో ఎస్‌వీ రైస్ మిల్లులో ఆకస్మిక తనిఖీలు జరిపారు. ఈ సందర్భంగా 30 బ్యాగుల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 15 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. పోలీసులు వాటిని స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ పీ లక్ష్మారెడ్డి తెలిపారు. అనంతరం రేషన్ బియ్యం స్వాధీనంపై పోలీసులు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. ఇక సదరు మిల్లులో సీఎంఆర్‌కు సరిపడే ధాన్యం నిల్వలు లేవని విజిలెన్స్ అధికారులు పౌరసరఫరాల శాఖ అధికారులకు సమాచారం అందజేశారు. మంగళవారం సివిల్ సప్లై అధికారులతో పాటు విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా ఎస్‌వీ ఇండస్ట్రీస్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి సీఎంఆర్ డెలివరీ చేయాల్సిన 11 వేల క్వింటాళ్ల వరి ధాన్యం తక్కువగా ఉన్నట్లు అధికారుల తనిఖీల్లో గుర్తించినట్లు డీటీసీఎస్ వేణుగోపాల్ తెలిపారు. నివేదికను అదనపు కలెక్టర్‌కు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ సీఐలు ప్రశాంత్‌రావు, అనిల్‌కుమార్, విజిలెన్స్ తహసీల్దార్ దినేశ్, సివిల్ సప్లై ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సిబ్బంది దాడుల్లో పాల్గొన్నారు.

శ్రీ చైతన్యలో బతుకమ్మ వేడుకలు

తిమ్మాపూర్, అక్టోబర్ 17: ఎల్ఎండీ కాలనీలోని శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు బతుకమ్మలను పెద్దగా పేర్చి ఆడి పాడారు. ఈ సందర్భంగా శ్రీ చైతన్య చైర్మన్ మద్దసాని రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు సంస్కృతీసంప్రదాయాలను కాపాడాలన్నారు. ప్రతి యువతి బతుకమ్మ ఆడాలన్నారు. వేడుకల్లో ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్ రాజు, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

'నాయీబ్రాహ్మణులకు క్షమాపణ చెప్పాలి'

వీణవంక, అక్టోబర్ 17: సోషల్ మీడియాలో నాయీబ్రాహ్మణులను కించపరిచేలా పోస్టులు పెట్టిన దేశాయిపల్లి గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు గాలేటి సురేందర్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని నాయీబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు నారాయణదాసు కార్తీక్, తూముల శ్రావణ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని చల్లూరు గ్రామంలో నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ ప్రకటించిన బీఆర్ఎస్ మ్యానిఫెస్టోకు వ్యతిరేకంగా నాయీబ్రాహ్మణుల ఫొటో ట్యాగ్ చేసి తమ మనోభావాలు దెబ్బతీసేలా సోషల్ మీడియాలో పోస్టు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. 24 గంటల్లోగా గాలేటి సురేందర్‌రెడ్డి నాయీబ్రాహ్మణులకు బహిరంగ క్షమాపణ చెప్పక పోతే హుజూరాబాద్ నియోజకవర్గ స్థాయిలో ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు ముత్యాల రవీందర్, నారాయణదాసు రామ్ తదితరులు పాల్గొన్నారు.